
# వందేమాతరమ్...!

కొలికపూడి శరత్‌బాబు



నేనేమన్నానని...?!

దానికంత కోపం రావాలా? అన్ని మాటలనాలా? అంత సీన్ క్రియేట్ చేయాలా?

ఇట్స్ నథింగ్ బట్‌ఎ కాంప్లిమెంట్-!

'ఖామోషీ'లో మనీషా అద్భుతంగా నటించింది అనటం తప్పా?

'అగ్నిసాక్షి'లో నానాపటేకర్ సూపర్‌గా చేశాడని మెచ్చుకోటం నేరమా?

ఇదీ అంతేగా...

నేనన్నది కేవలం ఆ ఉద్దేశంతోనే గానీ మరే దురుద్దేశంతో కాదుగా...

మరి దానికెందు కింత గొడవ...రభస...

'పక్కింటి డేవిడ్ పాటలు బాగా పడుతాడు గదండీ'

ఇదీ నేనంది...!

పక్కింటి డేవిడ్ కన్ను బాగా కొడతాడనీ- లేదా ముద్దులు బాగా పెడతాడనీ లేదా...ఇలా నేనేం తప్పుడు కూతలు కూయలేదే...జస్ట్ పాటలు బాగా పాడతాడు అన్నాను. అంతేగా...!

'అయితే పాటలు పాడే వాడినే చేసుకోలేకపోయావ్... ఈ గుమాస్తా గాడిని ఎందుకు చేసుకున్నావ్?'

నిజం- ఆయన సరదాగా అంటున్నాడనుకుని నవ్వుతూ ఆయన వేపు చూశాను...

అప్పుడు తెలిసింది- అది సరదాగా అన్న మాటకాదనీ...

చండప్రచండమైన కోపంతో రాలిన నిప్పు కణికలని...!

'అయ్యో- అదేంటండీ...ఇప్పుడు...నేనే...'

'నోర్ముయ్. అట్టే వాగకు- నీ వాలకం నేను గమనిస్తూనే ఉన్నాను. మొన్నటికి మొన్న ఆ హనీఫ్‌గాడు బొమ్మలు బాగా గీస్తాడన్నావు. ఎదురింటి విస్సుగాడు కవిత్వం అద్భుతంగా రాస్తాడన్నావు. వాడెవడో నీ మావ వరసవుతాడు- వాడు కథలు బాగా రాస్తాడన్నావు. ఇప్పుడు ఈ డేవిడ్‌గాడి మీద పడిందా కన్ను?' అరిచాడు.

దిమ్మెరపోయి చూశాను.

ఏం మనిషి పాడు? నేను అన్నదాంట్లో తప్పేముంది?

ఇక ఈ మనిషితో వాదించి లాభం ఉండదని తెలుసు నాకు- అయినా వాదిస్తే బాగానే ఉంటుంది. కానీ అది వాదన కాదు. వాగుడు...ఆ వాగుడు భరించేకన్నా నోర్మూసుకుని పడుకోవటం బెటర్!

రాత్రి జరిగిన గొడవకు ఉదయం టిఫన్ కూడా చేయకుండా వెళ్ళిపోయాడు. నాకిలాటివి అలవాటైపోయాయి కనుక- శుభ్రంగా ఇడ్లీలు వేసుకుని కారప్పొడీ- నెయ్యి-కొబ్బరి చట్నీ (రాత్రి చేసి ఫ్రిజ్‌లో పెట్టింది) వేసుకుని కడుపునిండా తినేశాను. ఆయనేదో అన్నాడని నా కడుపు కాల్చుకోవటం శుద్దదండగని చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను.

మధ్యాహ్నం లంచ్‌కు రాలేదు. అంటే సమ్మె కొనసాగిస్తున్నాడన్నమాట- ములక్కాయ పప్పు- కాకరకాయ వేపుడూ- వండు మిరపకాయల పచ్చడీ నెయ్యి వేసుకుని రోజుకన్నా ఎక్కువ లాగించేశాను.

ఇప్పుడు టైమ్ చూస్తే నాలుగున్నర అయింది. నిద్ర పట్టిచావలేదు. కనీసం ఓ గంట నిద్రపోయినా ఫ్రెష్‌గా ఉండేదేమో- లేచి టీ పెట్టుకుంటుంటే పనిమనిషి దుర్గ వచ్చింది. ఆమెకు గిన్నెలు వేసి టీ కప్పు తీసుకుని హాల్లో కూర్చుని రిమోట్ అందుకుని టీవీ ఆన్ చేశాను.

స్టార్ మూవీస్‌లో మాంఛి మసాలా సినిమా వస్తోంది.

ఆయనుంటే అసలు స్టార్ మూవీస్- వీ ఛానెల్- ఎమ్‌టీవీ ఇలాంటివేమీ పెట్టనివ్వడు. అవన్నీ అప్రాచ్యపు ఛానెల్స్ అట. పోకిరీ మరియు రౌడీ ప్రోగ్రామ్స్ అట- ఆజ్‌కల్ పిల్లలు చూస్తున్నారా ఛానల్స్- నేను చూస్తే తప్పేంటో అర్థం కాదు!

అదృష్టం ఛానల్స్ లాక్ చేసే సిస్టమ్ ఈ టీవీకి లేదు- లేకపోతే అంతపనీ చేసి వెళ్ళేవాడే...!

వామ్మో...ఆ హీరోయిన్ డ్రెస్సేంట్రా బాబూ. ఆమె ఒంటి మీదున్న బట్ట మొత్తం తిప్పి తిప్పి చూసినా ఓ అడుగైనా ఉంటుందో- ఉండదో డౌట్-! ఏం తిప్పుకుంటూ నడుస్తుందిరా దేవుడా...అదుగో- వాడే హీరో అయ్యుంటాడు. యమ స్మార్ట్- వాడు అంతే చిన్న కట్ డ్రాయర్ వేసుకుని ఉన్నాడు. కండలు తిరిగిన శరీరం- వాడు చెయ్యెత్తినా- ఊపిరి పీల్చినా కండలు పొంగుతున్నాయి...హ...మ్మో...

నా ఊపిరి స్తంభించిపోయింది.

ముద్దు ఇలా కూడా పెట్టుకుంటారని ఇప్పుడే తెలిసింది- చూస్తున్న, నాకు ఊపిరాడ్డంలేదు- ఇంక వారికెలా వుండో- హీరోయిన్ గోళ్ళు, హీరో వీపుకు గుచ్చుకుని రక్తం వస్తోంది. కానీ ఆ మానవుడికి స్పృహేలేదు.....

'అమ్మగారూ....'

చప్పున ఛానల్ మార్చి - వెనక్కి తిరిగి ఏంటి? అన్నాను.

దుర్గ నవ్వు చూస్తూనే అర్థమైంది - అదెప్పటినుంచో టీవీ చూస్తోందని

'పనయిపోయిందమ్మా- 'వుండు టీఇస్తా' అని వంటగదిలోకి వెళ్లి దుర్గకోసం కేటాయించిన కప్పులో టీ పోసి ఇచ్చాను.

ఆమె పైటకొంగుతో అందుకుని చప్పరిస్తూ తాగసాగింది.

తొరగాతాగి వెళ్లిపోతే బాగుణ్ణు- మసాలా సినిమా చూడొచ్చు. అవతల ఇంకెన్ని అద్భుతమైన సీన్లు పోతున్నాయో. ...

'అమ్మగారూ' అంది దుర్గ

'ఏంటే...?'

'ఓ ఇరవై రూపాయిలుంటే ఇవ్వండమ్మ గారూ.... అంది

'దేనికి?' అన్నాను.

'చిరంజీవి సినిమా- బావగారూ-బాగున్నారా, ఇద్దరం వెళ్లాలనుకున్నాం అమ్మగారూ! అంది నాకో అనుమానం వచ్చింది. ఇది చిరంజీవి అభిమాని-చిరంజీవి సినిమా ఏదొచ్చినా వదలిపెట్టదు. మొగుడుతో కలిసి వెళ్లితీరాల్సిందే. వారం క్రితమే 'రాక్షసుడు' వచ్చిందని ఇరవై రూపాయలు తీసుకుంది.

'నీకు చిరంజీవంటే అంత ఇష్టమా?' అన్నాను.

'అవునమ్మగారూ - ప్రాణం' అంది.

'మరి మీ ఆయన నిన్నేమనడా...?' అన్నాను.

'అదేంటమ్మగారూ- ఆడేమంటాడు? ఇంక ఆడే ...ఈరోజు చిరంజీవి సినిమా వచ్చిందే ఎల్దాం అని తీసుకువెళ్తాడు అంది.

'ఆ వచ్చే జనమంటా వుంటే చిరంజీవి లాటి మొగుణ్ని చేసుకుంటా అంటానమ్మ గారూ...' అంది నవ్వుతూ...

'మరి మీ ఆయనకు కోపంరాదా...?' భయంగా, ఆశ్చర్యంగా అడిగాను...

'భలేవోరమ్మగారూ...! నేనట్టా అంటే... ఆడేమంటాడో తెలుసా...' అయితే వచ్చే జనమలో నేనే చిరంజీవినైపుడుతాన్.. ..' అంటాడు. -ఆడు చానా మంచోడమ్మగారూ --'నేనంటే ప్రాణం' అంది మురిపెంగా...

'మరి నీకు...?'

'నాకూ ప్రాణమే...'

'ఇందాక చిరంజీవి ప్రాణమన్నావ్?' డిఫెన్స్ లాయర్ లెవల్లో అడిగాను దుర్గ అమాయకంగా చూసింది.

'అదేందమ్మగారూ...అది సిన్మా...ఇది బతుకు...సిన్మాలో చిరంజీవి అంటే ఇష్టం. బతుకులో మొగుడంటే ఇష్టం. దేనికదే... రెంటికీ సాంఘత్యం ఏంది? అంది.

అవును రెంటికీ సంబంధమేలేదు.

దీనికున్న ఇంగితం ఎమ్మే చదివి 'ఏఎస్సైగా గా పనిచేస్తూ ఇప్పుడు ప్రైవేటుగా లా చదువుతున్న మా ఆయనకు లేదు.. !

ఇంక నేనేం మాట్లాడకుండా బెడ్‌రూంకెళ్లి 30 రూపాయిలు తీసుకువచ్చి ఇచ్చాను. దుర్గ ఆశ్చర్యంగా చూసి...

'ఇదేందమ్మగారూ...ఇరవైచాలు...' అంది.

'ఉంచుకోవే..ఆపదీ నేనిచ్చినట్లు.ఇంటర్వెల్లో ఇద్దరూ టీ తాగండి' అంది .దుర్గ చేతులు జోడించి ఆనందంగా వెళ్లిపోయింది.

నిస్సత్తువుగా సోఫాలో కూర్చున్నాను. టీవీ ఆన్‌చేయాలనిపించలేదు. ఎందుకీ దొంగబతుకనిపించింది.


ఇష్టమైన ఛానెల్ చూడటానికిలేదు. ఇష్టమైన పాటలు వినటానికి, సినిమాలు చూడ్డానికే లేదు. జీవితం అంటే విరక్తి కలుగుతోంది.

ఎదురుగా తోటలో వున్న పూలు పూయని మొక్కకూ నాకు తేడా లేదనిపించింది. ఆ మొక్క పేరోదో చెప్పాడాయన ... యస్... ఫెరన్ మొక్క ...

అది పూలుపూయదట, ఊరికే అందంగా వుంటుందని పెట్టుకోవడమేనట - నేనూ అంతేగా...ఫలానా శివమూర్తిగారి పెళ్ళాన్ని అనిపించుకోవడమే నాకు గొప్ప, అంతకుమించి నా ఉనికికి గుర్తింపులేదు. నా మనుగడకు అర్థం లేదు.

'వందేమా..తరం...!

పక్కింటి డేవిడ్ గిటార్‌వాయిస్తూ పాడుతున్నాడు.నాకు గనుక డేవిడ్ అని తెలుస్తోంది. కొత్తవారు వింటే అది ఖచ్చితంగా ఏ.ఆర్.రెహమాన్ పాడుతున్నాడనుకుంటారు. అంత అద్భుతంగా పాడుతున్నాడు. డేవిడ్‌కింకా పెళ్లికాలేదు.



ఫైన్‌ఆర్ట్స్ కాలేజీలో ఫోటోగ్రఫీ చేస్తున్నాడు. ఎప్పుడూ జీన్స్‌ఫాంటు, టీ-షర్టులు తప్ప వేరేవి వేయడు. మొన్నోసారి తెల్లటి షర్ట్ వేసుకొచ్చాడు.

'జస్ట్ డూ ఇట్' అని దానిమీద ఇంగ్లీసులో రాసుంది

'అంటే ఏంటి డేవిడ్? అడిగాను అమాయకంగా.

'అదంతే అంటీ-వాటికి అర్థాలుండవు- ఎవరికి తోచినట్టువారు అర్థం చేసుకోవాలి-అంతే-' అన్నాడు నవ్వుతూ.

డేవిడ్‌కు నా వయస్సుంటుందేమో-లేదా నాకన్నా ఓ సంవత్సరం చిన్నవాడేమో- అయినా నన్ను 'అంటీ' అంటుంటే... మొదట్లో నాకు ఏదోలా ఉండేది-తర్వాత అలవాటైపోయింది.

'అంటీ-మీది అద్భుతమైన ఫోటోజెనిక్ ఫేస్-నాతో ఓ సెషన్ చేయకూడదూ-? అన్నాడోసారి.

'అంటే-ఏంటి?' అన్నాను.

'ఓ గంట నాతో ఉండాలాంటీ-నేను మిమ్మల్ని డిఫరెంట్ ఏంగిల్స్‌లో ఫోటోలు తీస్తాను' అన్నాడు.

నా గుండెలయ తప్పింది.

పెళ్లయిన కొత్తలో మా ఆయనతో కలిసి మా ఊళ్లో స్టూడియోలో దిగిన ఫోటో-అంతే-ఇంతవరకూ నేను ఫోటో దిగలేదు. ఇప్పుడు ఆ ఫోటోలో నన్ను నేను చూసుకుంటుంటే-నాకే నవ్వొస్తుంది. నూనె పెట్టినున్నగా దువ్విన తల- మల్లెపూలు-పెద్దబొట్టు-కెమెరా వేపు భయంగా చూస్తూ--ఎన్నోసార్లు ఫోటో దిగుదాం అని అడిగాను.

'ఎందుకు మెళ్లో తగిలించుకుని ఊరేగుతావా? అని ఉరిమాడు.

అంతే-ఆ తర్వాత ఇంక నేను అడగలేదు.

డేవిడ్ వాళ్ల మమ్మీని నేను అంటీ అని పిలుస్తాను. ఆమె కూడా నన్ను 'అమ్మాయ్..' అంటూ సొంత కూతురిలా ఆత్మీయంగా పిలుస్తుంది.

కాఫీ పొడికో-పంచదారకో డేవిడ్‌ను పంపిస్తోంది.

స్కూటర్ చప్పడైంది.

అంటే మా సార్ వచ్చినట్టున్నాడు-స్కూటర్ స్టాండేసిన చప్పుడు-చెప్పలు విసురుగా కొట్టుకుంటూ వస్తున్న శబ్దం వినిపించి- ఇంకా సమ్మె కొనసాగుతూనే ఉందని అర్థమైంది.

విసురుగా చెప్పలు వరండాలో విసిరి- లోపలికొచ్చి నావేపూ-టీవీ వేపూ చూసి- సోఫాలో కూర్చున్నాడు. నేను లేచి వెళ్లి టీ కలుపుతుంటే అప్పుడు అనుమానం వచ్చింది. రిమోట్ అందుకుని తప్పకుండా టీవీ ఆన్‌చేసి చూస్తాడు.

అదృష్టం-పనిమనిషి పిలవడం చేత-స్టార్ మూవీస్ ఛానల్ మార్చి-ఏదో తెలుగు ఛానలే వస్తుంటే ఆఫ్ చేశాను!

టీ కలిపి తీసుకొచ్చేసరికి ఆయన ఈటీవీలో 'అన్నదాత' కార్యక్రమం చూస్తున్నాడు. ఎరువులు-విత్తనాలు- వ్యవసాయం..ఆయనకేం పొలాలు లేవు. రైతు కాదు. ఎందుకంట ఈ కార్యక్రమం చూడటం...?!

'టీ తీసుకోండి' అన్నాను.

'అక్కడ పెట్టు'

ఇందాక నేను మసాలా సినిమాలో ముద్దుసీన్ చూసినంత ఇంటరెస్టింగ్‌గా ఆ ప్రోగ్రాం చూస్తూ వున్నాడు. నేను శబ్దం వచ్చేలా కప్పు టీపాయ్ మీద పెట్టి వంటగదిలోకి వెళ్లిపోయాను.

పక్కింట్లో డేవిడ్ 'వందేమాతరం' పాడుతూనే ఉన్నాడు నాకు తెలుసు. ఆ పాట వింటున్న మా ఆయనకు తేళ్లూ- జర్రులూ పాకుతున్నట్టు ఉంటుంది. అదేం బూతుపాట కాదుగా...ఏ పాటయినా అది మగాడు పాడింది గనుక నేను వినకూడదు-మెచ్చుకోకూడదు-అదృష్టం.

మగ దేవుళ్లను పూజించొద్దు-ఆడదేవతలనే పూజించు అనలేదు! రాత్రి పదయింది.

నేను వంటగది సర్ది-రేపు టిఫిన్‌కు పిండి కలిపి-ఫ్రిజ్‌లో పెట్టి బెడ్‌రూంకొచ్చాను. ఆయన అటు తిరిగి పడుకుని ఉన్నాడు. సమ్మె చాలా ఉధృతంగా ఉందని అర్థమైంది. ఇలాటి సమ్మెలు పగటివేళలకు మాత్రమే పరిమితమై రాత్రిపూట అంతమవుతాయి. ఇప్పుడు గురుడి వాలకం చూస్తుంటే-రాత్రి కూడ సమ్మె కొనసాగేలా ఉంది.

ఎమర్జెన్సీ సర్వీస్ వాళ్లు సమ్మెచేస్తే ప్రభుత్వం ప్రజలకు ఇబ్బంది కలగకుండా యుద్ధప్రాతిపదిక మీద చర్యలు తీసుకుని ఆ సమ్మెకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేస్తారట...

ఈ రాత్రి మా ఆయన చేసే సమ్మెకు ప్రత్యామ్నాయం ఏంటో ప్రభుత్వాన్ని అడిగితే...ఏం చెపుతారో...?!

అసలు నిద్రపట్టడం లేదు. మనస్సంతా ఫ్రెష్‌గా ఉంది. సమ్మె ప్రభావమేమో...! ఎప్పుడు నిద్రపోయానో నాకే తెలీదు. మొత్తానికి గాఢ నిద్రపట్టేసింది. ఉలిక్కిపడి లేచాను.

కాదు-ఎవరో లేపారు...కళ్లు నులుముకుని చూశాను. ఏం జరిగిందో అర్థం కాలేదు. కానీ వీపు మాత్రం చుర్రుమంటోంది. మా ఆయన నావేపు కోపంగా చూస్తున్నాడు.

'ఏంటి? అన్నాను కోపంగా

ఈయనే నన్ను వీపు మీదకొట్టి లేపాడని అర్థమైంది.

ఏంటా కలవరింతలు? అన్నాడు నిప్పులు కక్కుతూ

ఏం కలవరింతలు? అన్నాను అయోమయంగా

అన్ని రౌడీ వేషాలూ - రౌడీ బుద్ధులూ.. మింగేసేలా చూస్తు అన్నాడు

ఏం కలవరించానో చెప్పండి అసహనంగా అన్నాను.

నా గుండె మండిపోతోంది. మంచి నిద్ర-బంగారం లాటి మత్తునిద్రలో ఉన్న మనిషిని అలా వీపు మీద వాతలు తేలేలా, కొట్టి లేపితే. ఎంత పతివ్రతకయినా కోపం రాదేంటి మరి..?!

సిగ్గులేక పోతే సరి. కోపంగా అన్నాడు.

అసలేం జరిగిందో చెప్పి తిట్టండి అన్నాను

వందేమాతరం..అంటూ దీర్ఘం తీస్తూ పాడుతున్నావ్.. ఏం అంత బాగా వచ్చిందా ఆ పాట..? కసిగా అన్నాడు

నేను రెండు నిమిషాలు ఆయన కళ్లలోకి తదేకంగా చూసి-దుప్పటి ముసుగుతన్ని అటు తిరిగి పడుకుంటూ అన్నాను

వందేమాతరం పాడటం తప్పు కాదు పైగా -పాడకూడదు అనడం దేశ ద్రోహం, మీ ఇష్టం- ఏకోర్టు కెళ్తారో-- ఏం కేసు పెట్టుకుంటారో పెట్టుకోండి-అయాం రెడీ-- ఇంక నన్ను డిస్టర్బ్ చేయొద్దు. గుడ్‌నైట్...!! ■

వచ్చేవారం కథ

**అన్నయ్‌గారు**

-పాటిబండ్ల రజని